మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

బీసీలకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి

■ మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ

తాడేపల్లి : బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైన చంద్రబాబు బీసీలకు క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ డిమాండ్ చేశారు. వైయస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు చేసిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తూ వైయస్ఆర్సీపీపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు ప్రధాని, కేంద్ర హోంమంత్రితో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు.

అమరావతిపై ఉన్న శ్రద్ధ బీసీ రిజర్వేషన్లపై ఏదీ?

అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అదే స్థాయిలో ఎందుకు కృషి చేయడం లేదని వేణుగోపాల కృష్ణ ప్రశ్నించారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని,



రాజ్యాంగబద్ధమైన పరిష్కారాల కోసం పోరాడాలని అన్నారు. పార్టీ టికెట్లు ఇవ్వడం వేరు, చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించడం వేరని స్పష్టం చేశారు. జీవోలు ఇచ్చినప్పుడు గొప్పలు చెప్పుకోవడం, పాలాభిషేకాలు చేయించుకోవడం కాకుండా, వాటి ద్వారా బీసీలకు న్యాయం జరిగేలా చూడాలని హితవు పలికారు.

బీసీలకు ఇచ్చిన హామీల అమలేది?

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని వేణుగోపాల కృష్ణ విమర్శించారు. ఆదరణ పథకానికి కేటాయించిన నిధులు, చేసిన ఖర్చుపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామన్న హామీ ఏమైందని, కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసి శిక్షణ పొందిన మహిళలకు ఇప్పటికీ మిషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సుమారు రూ.9 వేల కోట్లకు చేరాయని పేర్కొంటూ, బీసీ కుటుంబాల విద్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.

బీసీలను కులవృత్తులకే పరిమితం చేయాలనుకుంటున్నారా?

బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వేణుగోపాల కృష్ణ విమర్శించారు. బీసీ నాయకులకు పదవులు ఇచ్చి వైఎస్ జగన్ను విమర్శించడానికే పరిమితం చేస్తున్నారని అన్నారు. బీసీ మంత్రులు తమ శాఖల ద్వారా ప్రజలకు న్యాయం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. బీసీల రాజకీయ సాధికారత కోసం వైయస్ఆర్సీపీ ప్రభుత్వం అనేక పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించిందని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు.

Main Edition
13 Oct 2026 Page No. 5